www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
AKSHITHA TV
ప్రతిక్షణం... ప్రజాపక్షం
సంపుటి : 16
సంచిక : 292
బుధవారం 30 సెప్టెంబర్ 2026
SIMULTANEOUSLY PUBLISHED FROM NALGONDA | RANGAREDDY | HYDERABAD I KHAMMAM | WARANGAL I MAHABUBNAGAR I KARIMNAGAR I NIZAMABAD | AMARAVATHI
చీఫ్ ఎడిటర్ : ఎం. దాస్
పేజీలు : 10+8 వెల : రూ.5.00






# తుమ్మిడిహెట్టి పై సీఎం రేవంత్ పట్టు



- ఒప్పించండి ఇప్పించండి
- నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి
- పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులివ్వండి
- కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి : తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియ జేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి మిగతా2లో

# నక్షాతో నిగ్గు తేల్చుతాం




## ధరణితో రికార్డులు తారుమారు
## మా భూములను ఎర్రవెల్లిలోని స.నె. 325లో కలిపారు
## సర్వే చేసి మా భూములు మాకు ఇప్పించండి
## పొంగులేటికి వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు
## భూ సమస్యపై సమగ్ర విచారణకు హామీ
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్షిత ప్రతినిధి : సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మిగతా2లో

# పెట్టుబడులకు స్వర్గధామం..
# తెలంగాణ

●అవకాశాలు...అపారం ●పెట్టుబడులతో రండి



పెట్టుబడులకు ఆహ్వానం
ఇన్వెస్టర్స్ సద్వినియోగం చేసుకోవాలి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

ఫ్రాంక్‌ఫర్ట్ /జర్మనీ సెప్టెంబర్ 29 : జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత 2లో

# పప్పుధాన్యాల సాగులో దేశంలోనే రెండవ స్థానం



దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలి
పామాయిల్ ధరపై ప్రత్యేక కమిటీ వేస్తామని హామీ
కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
మంత్రి తుమ్మల

న్యూఢిల్లీ, అక్షిత ప్రతినిధి : పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగులో గత ఏడాది ఖరీఫ్ కంటే 36% అధికంగా సాగుచేసి తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని మిగతా2లో



# పేదింటి కలల స్వప్నం ఇందిరమ్మ టవర్స్

- సొంతింటి కాంక్షకు ప్రతిరూపం
- ప్రతిష్టాత్మకంగా ఆత్మగౌరవ పతాక
- పేదల కన్నీటికి విలువ కట్టలేం
- ఏడాదిలో ఇందిరమ్మ ఇళ్ల తాళాలు
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్షిత ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర మిగతా2లో



10

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

# చదువుతోనే ఉజ్వల భవిత

## విద్యతో బంగారు బాటలు

ఆత్మవిశ్వాసంతో ముందడుగు
అమ్మకు అక్షర మాల
మహిళలకు మళ్లీ చదువుకునే అవకాశం
ఆగిపోయిన చదువును కొనసాగించండి
మంత్రి సీతక్క



మహిళలు ఏ కారణంతోనైనా తమ చదువును మధ్యలో ఆపేసి ఉంటే, మళ్లీ చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని రాష్ట్ర 12 పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు.




# కేటీఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం

రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న
చామల కిరణ్ కుమార్ రెడ్డి
సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ

అక్షిత ప్రతినిధి :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా మిగతా10లో

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
General
జనరల్
నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్

## పప్పుధాన్యాల సాగులో దేశంలోనే రెండవ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యల తో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగులో గత ఏడాది ఖరీఫ్ కంటే 36% అధిక ంగా సాగుచేసి తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల తెలిపారు. జాతీయ రబీ సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రాష్ట్ర వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతితో పాటు రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పంటల వైవిధ్యీకరణ, వాతావరణ మార్పులను ఎదుర్కొనే వ్యవ సాయం, డిజిటల్ వ్యవసాయం, వ్యవసాయ మౌలిక వసతులు, రైతులకు రుణ సదుపాయాలపై తెలంగాణలో అమలు చేస్తున్న చర్యలను కేంద్రం దృష్టి కి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్య కరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో 36% వృద్ధితో తెలంగాణ ముందువరసలో నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండ గా నిలిచేందుకు మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అనేక మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాకుండా మండలాల స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని కోరారు. సూక్ష్మ సాగునీరు, రక్షిత సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ సాగు విషయ ంలో తెలంగాణ రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్‌పామ్ దీర్ఘకాలిక పంట కావడంతో రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు ఎంతో ముఖ్యమని, రైతుల్లో నమ్మకాన్ని కొనసాగించేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. దేశీయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులను ఈ దీర్ఘకాలిక పంట వైపు తీసుకెళ్తున్న సమయంలో దిగుమతుల విధానం కూడా రైతులకు అనుకూ లంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీని నియమించి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చి నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని ప్రస్తుతమున్న సుమారు లక్ష నుంచి రెండు లక్షల నమూనాలకు పెంచాలని మంత్రి కోరారు. శాస్త్రీయ మట్టి పరీక్షల ద్వారా సమతుల్య ఎరువుల వినియో గం, సాగు ఖర్చుల తగ్గింపు, ఉత్పాదకత పెంపునకు అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా ప్రస్తుతం 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మాత్రమే ఉన్నాయని మంత్రి తెలిపారు. వ్యవసాయ పరిశోధన, విద్య ద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతు లకు చేరాలంటే వ్యవసాయ విస్తరణ వ్యవస్థను మరింత బలోపేతం చేయా ల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రా లను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఐసీఏఆర్‌ను కోరారు. కొడం గల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీ-అరిడ్ హార్టికల్చర్ క్రాప్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌లను సమర్పించిందని మంత్రి తెలిపారు. ఈ రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని కోరారు. రైతులకు కేవలం విత్తనాలు, ఎరువులు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, శాస్త్రీయ సలహాలు, నీటి పొదుపు విధానా లు, వ్యవసాయ విస్తరణ సేవలు, మౌలిక వసతులు, నమ్మకమైన మార్కెట్లు అవసరమని మంత్రి పేర్కొన్నారు. పరిశోధన, వ్యవసాయ విద్య, విస్తరణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే కొత్త సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వేగంగా చేరుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబం ధించిన ప్రత్యేక అవసరాలను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అవస రమైన సహకారం అందించాలని మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# తుమ్మిడిహెట్టి పై సీఎం రేవంత్ పట్టు



ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమ ంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయం త్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధి ంచిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చిం చారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారా ష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలిం చేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాల మూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శ కాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యం లో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమ తులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమ తుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగు తోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారు దల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవస రమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్ప టికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వం ిగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్ర టరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నక్షాతో నిగ్గు తేల్చుతాం

(మొదటిపేజీ తరువాయి)

ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయా లని అధికారులను ఆదేశించారు. సోమ వారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామాని కి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పఠాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్కులను తీసుకున్నారని, అయితే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రికార్డులు--పాత పాస్‌బుక్కులు--గ్రామ నక్షా--క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణ ంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అదేవిధంగా దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం” అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, సర్వే ఉ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు స్వర్గధామం..తెలంగాణ

జర్మనీలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటన కొనసాగుతోంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, తెలుగు ప్రవాసులతో అనుసంధానం అంశాలపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఇన్నోవేషన్, టెక్నాలజీ వంటి వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ను భారత కాన్సులేట్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. అంతకుముందు.. ఈ బృందానికి అక్కడి అధికారులు ఘన స్వాగతం పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని, గ్రేటర్ హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగు ప్రజలు తమ మాతృభూమితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, తెలంగాణ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలంగాణ వాసులు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను తీసుకురావడంలో గొప్ప వారధిగా నిలవాలని స్పీకర్ ప్రసాద్ సూచించారు. "ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లెజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు. జర్మనీ-భారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించింది. ఇప్పుడు దానికి రిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్ లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ లో ఈ బృందం పర్యటించనుంది. వచ్చే నెల 9వ తేదీన శాసన సభ స్పీకర్, శాసన మండలి చైర్మన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ జరిగింది. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలిస్తుంది.

# పేదింటి కలల స్వప్నం ఇందిరమ్మ టవర్స్

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసిం గ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంత స్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగ ళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహ చర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మె ల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భ ంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 16--17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**ఏడాదిలోపే ఇంటి తాళాలు**

ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుం డా ఒక ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి, ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా.. అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమిషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం**

టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.



నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీ మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి, తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు.

**నగరానికి దూరంగా ఇళ్లు కట్టి పేదలను ఇబ్బంది పెట్టం**

గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 30--40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తుందని మంత్రి అన్నారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాకుండా, ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మంది లబ్ధిదారులకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో రెండో, మూడో, నాలుగో విడతలను ప్రారంభించి, ఎన్నికలలోపు నాలుగు విడతల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి పొంగులేటి లక్కీడ్రాలో విజేతలైన లబ్ధిదారులకు ఇళ్ల నెంబర్ల కేటాయిస్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేను లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్ లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎండి వివి గౌతమ్, కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.

# రక్తంతో సీఎంకు లేఖ రాసిన బీజేపీ నేత, కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్

**- ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**



కరీంనగర్ అక్షిత బ్యూరో

దళితుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, బీజేపీ దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు అందాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రోజున తన స్వంత రక్తంతో సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసి పంపారు. ఈ సందర్భంగా సోమిడి వేణు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రావాల్సిన సబ్సిడీ రుణాలు, అభివృద్ధి నిధులు ఆగిపోవడం వల్ల దళిత యువకులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని వేణుప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన అనేక హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని,దళితుల హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితుల అభ్యున్నతి కోసం కేటాయించాల్సిన నిధుల పట్ల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని సోమిడి వేణుప్రసాద్. తీవ్రంగాతప్పు పట్టారు.వెంటనే నిధులను విడుదల చేయాలని, లేనిచో దళితులను ఐక్యం చేసి ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మి నారాయణ, నాయకులు ఎడ్ల సురేష్, మెంగని రాజయ్య, గాలి సురేష్, కంపల్లి సుమన్, కుడిదినాగేందర్, సునీల్, నవీన్,పవన్ కళ్యాణ్ బండిపల్లి సంజీవ్, సతీష్, రాజు శేషిధర్, సాయిరాం, భానుచందర్, సంగం వేణు పెదపల్లి సాయి పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాయన్న నియామకం

**- శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే జి విట్టల్ రెడ్డి**

లోకేశ్వరం,సెప్టెంబర్ 29 అక్షిత న్యూస్ :



నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామానికి చెందిన దర్శనం సాయన్న,ను నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి, సాయన్నకు ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాయన్న నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సమతా సుదర్శన్, తూర్పాటి వెంకటేష్,నిర్మల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్ట శ్యామ్‌లకు మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్తా గౌడ్,సర్పంచ్ చరణ్, ఉపసర్పంచ్ రమేష్, నర్సారెడ్డి, మాజీ సర్పంచులు దత్తు గౌడ్, రాజు, శ్రావణ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**- మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించిన వెలిచాల రాజేందర్‌రావు**

కరీంనగర్ అక్షిత బ్యూరో



నేడు బుధవారం ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరిశీలించారు.రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి ఆయన కలెక్టరేట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలు, పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక, పార్కింగ్, ఇతర సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ స్మశాన వాటికలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

**- తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..**

తాండూరు అక్షిత ప్రతినిధి:



తాండూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని బీసీ స్మశాన వాటికలను దశల వారీగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. స్మశాన వాటికల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, పరిశుభ్రంగా, సౌకర్య వంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడు తున్నామని, పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటికను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత సిబ్బంది, నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించ నున్నట్లు తెలిపారు. స్మశాన వాటికల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. అలాగే పాత తాండూర్‌లోని 14వ వార్డు బోనమ్మ టెంపుల్ సమీపంలోని బీసీ స్మశాన వాటికలో ఏడాది క్రితమే బోర్ వేయించి నీటి సదుపాయం కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే కంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని బీసీ స్మశాన వాటికల్లో ప్రజలకు అవసరమైన నీటి సదుపాయం, ప్రహరీ గోడలు, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులను దశల వారీగా కల్పిస్తామని, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా స్మశాన వాటికలను సౌకర్యవంతంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం, స్థానిక సంస్థల సమ న్వయంతో చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాకేష్, కౌన్సిలర్లు, బీసీ నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యం మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ అక్షిత బ్యూరో





నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తమ పాలకవర్గం శ్రమిస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు 19, 49వ డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొదటగా 49వ డివిజన్ విద్యానగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ తో కలిసి నగరపాలక సంస్థకు చెందిన రూ. 10 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులను భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ ను మేయర్ సందర్శించారు. హాస్టల్ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. వాటిని పరిష్కారిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం 19వ డివిజన్ హరిహర నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడు తూ నగర ప్రజలు, పాలకవర్గ సభ్యులు మా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిగణలోకి తీసుకుని దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. నగరంలో యూఐడిఎఫ్ కు చెందిన 50 కోట్ల నిధులతో డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభం చేసి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధించిన నిధులతో అభివృద్ధి పనులను పూర్తి చేసి మరో 30 కోట్ల నిధులతో డివిజన్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో కరీంనగర్ నగరాన్ని అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో చేర్చి 840 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 630 కోట్ల నిధులతో పలు ప్రాజెక్టులకు ప్రతిపానలు సిద్దం చేసి వాటికి ఆమోదం తెలిపామన్నారు. సంబంధిత ప్రాజెక్టుల పనుల టెండర్ ప్రక్రియ కూడ చేపట్టామని త్వరలోనే వాటికి సంబంధించిన పనులు ప్రారంభం చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రధానంగా ప్రజలకు సమస్యగా మారిన డంప్ యార్డును ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్తను తొలగిస్తున్నామని త్వరలోనే ప్రాసెసింగ్ పద్దతిని కూడ చేపట్టి డంపుయార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అంతే కాకుండా విలీన గ్రామాల డివిజన్లను ప్రాధాన్యతగా క్రమంగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే పాలకవర్గ ధ్యేయం అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు నగర రూపురేఖలు మార్చేందుకు శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలోగా, నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాసేలా అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈ శ్రీనివాస్, స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టణాన్ని స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు









**- ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలి..**

**- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..**

తాండూరు అక్షిత ప్రతినిధి:


తాండూరు పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 1వ వార్డు నుంచి 6వ వార్డు వరకు నిర్వహించిన "స్వచ్ తాండూరు స్పెషల్ డ్రైవ్" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లోని రోడ్లు, మురుగు కాలువలు, చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఎమ్మెల్యే దగ్గ రుండి పరిశీలించి, అధికా రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎమ్మెల్యే సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని, తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు**

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక వసతులు, తరగతుల నిర్వహణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, బోధన, తరగతుల నిర్వహణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉపా ధ్యాయులతో మాట్లాడి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందేలా చూడాలని సూచించారు. అనంతరం వార్డుల్లోని సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ ప్రజలకు, చిన్నారులకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, స్పెషల్ డ్రైవ్ ద్వారా చేపడుతున్న పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని అన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకుంటూ, స్వచ్ఛమైన తాండూరు నిర్మాణానికి మున్సిపాలిటీకి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాకేష్, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, తాండూరు పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాటి జెన్‌జీ వేదిక నౌ జవాన్ భారత్!

దేశవ్యాప్తంగా విద్యార్థి యువజనులు ఉద్యమస్ఫూర్తితో రాజకీయ చైతన్యాన్ని చాటుకుంటున్న నేటి సందర్భంలో సరిగా వందేళ్ల క్రితం భారతదేశంలో యువజనులకు దేశభక్తిపూరిత విప్లవ లక్ష్యం గల ప్రణాళికను అందించిన 'నౌ జవాన్ భారత్ సభ'ను గుర్తు చేసుకోవటం ఎంతో అవసరం. "మన దేశం అస్తవ్యస్తతల మధ్య ప్రయాణం సాగిస్తున్నది. ప్రతిచోటా పరస్పర అనుమానాలు, నిస్పృహ ఆవరించి ఉన్నాయి. పెద్ద నాయకులు మన గమ్యంపై విశ్వాసం కోల్పోయారు. వారిలో చాలామంది ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు." -- ఈనాటికీ వర్తించేలా ఉన్న ఈ వాక్యాలు సరిగ్గా వందేళ్ల క్రితం 1926లో ఏర్పడిన 'నౌ జవాన్ భారత్ సభ' (పంజాబ్) రూపొందించుకున్న ప్రణాళికలోని మొదటి వాక్యాలు. ఈ ప్రణాళికకు రూపకర్తలు భగవతీ చరణ్ వోహ్రా, భగత్‌సింగ్‌లు. భగత్‌సింగ్ నిర్వహించిన విప్లవోద్యమ కార్యకలాపాలలో 'నౌ జవాన్ భారత్ సభ' ఏర్పాటు చెప్పుకోదగినది. కాకోరి కుట్ర కేసు పేరుతో విప్లవకారుల ఉరితీతలు, దీర్ఘకాలిక జైలు శిక్షలు, క్రూరమైన హింసాకాండ అమలు జరిగిన పిదప విప్లవకారులు చెల్లాచెదురైపోయారు. వారందరినీ తిరిగి కూడగట్టి, నూతన లక్ష్యాలతో సంస్థను పునర్నిర్మాణం కావించిన ఘనత భగత్‌సింగ్‌ది. 1926 మార్చిలో లాహోర్ కేంద్రంగా భగత్‌సింగ్ ప్రధాన కార్యదర్శిగా ఈ ప్రజాసంఘం పంజాబ్, సింధు రాష్ట్రాలలో కార్యకలాపాలను నిర్వహించింది. దీనికి ఒక స్పష్టమైన




ప్రణాళికను 1928లో రూపొందించుకున్నారు. అప్పటికి దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరికున్నంత స్పష్టమైన అవగాహనా, వైఖరీ కలిగిన యువజన సంఘం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బహిరంగ ప్రజా కార్యకలాపాలు, పోరాటాలను నిర్వహించడానికి విద్యార్థి, యువకులను కూడగట్టాలన్నది 'నౌ జవాన్ భారత్ సభ' ప్రధాన లక్ష్యం. ఈ సంఘం 'బ్రిటిష్ పరిపాలన నుంచి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలి' అనే డిమాండ్‌ను స్పష్టంగా, సూటిగా దేశం ముందుకు, యువజనుల ముందుకు తెచ్చింది. ఇప్పుడు పాకి??స్థాన్‌లో ఉన్న సింధు రాష్ట్రంలోను, ముఖ్యంగా రెండు దేశాలలోని పంజాబ్‌లలోను బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశభక్తిపూరిత చైతన్యాన్ని అందించటానికి, కర్తారుసింగ్ శరభ లాంటి అమరుల్లో త్యాగపూరిత స్ఫూర్తిని నింపటానికి నిర్మాణమైనదే నౌ జవాన్ భారత్ సభ! "ఎటువంటి భయమూ లేకుండా, ఎటువంటి సంకోచమూ లేకుండా, ఎటువంటి పురస్కారాలూ శోకతప్త నివాళులూ ప్రశంసలూ ఉండబోవని తెలిసి కూడా ప్రాణాలర్పించడానికి సిద్ధపడ్డవాళ్లు మనకు అవసరం" అని నౌ జవాన్ భారత సభ వందేళ్ల నాటి తమ ప్రణాళికలో ప్రకటించుకుంది. దేశభక్త యువవీరులు రూపొందించుకున్న ఆ ప్రణాళిక సారాంశాన్ని నేటి యువతరం కూడా తెలుసుకుని అన్వయించుకోవాల్సి ఉంది!

# సీఎం సభకు భారీగా తరలిరావాలి





- సిరిసిల్ల వేదికగా ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి సందేశం.. మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిరిసిల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 33 నెలలుగా ప్రజాపాలన ప్రభుత్వం కొనసాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతాంగం, కార్మికులు, విద్యార్థుల సంక్షేమంతో పాటు రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

## ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా విచ్ఛిన్నకరమైన విధానాలను అవలంబిస్తున్నాయని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగినా, వర్షాలు పడకపోయినా ప్రతిపక్షాలు సంతోషించే పరిస్థితి కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజలకు న్యాయం చేయాలనే సానుకూల ఆలోచనతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న సమయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అయితే ప్రతిపక్షాలు ఈ అంశంలో కూడా రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. సిరిసిల్ల వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలకు ఒక స్పష్టమైన సందేశం ఇవ్వనున్నారని మంత్రి పేర్కొన్నారు.

## ప్రజలపై అదనపు పన్నుల భారం వేయలేదు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం క్రమబద్ధీకరణతో ముందుకు సాగుతోందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజలపై అదనపు పన్నులు, విద్యుత్ చార్జీల భారం వేయకుండా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, కార్మిక రంగం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నామని చెప్పారు.

## అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వివరించారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు.

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనకడుగు వేయకుండా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని సూచించారు.

## 'చలో సిరిసిల్ల'కు తరలిరావాలి

సిరిసిల్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. భవిష్యత్తులోనైనా ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి పట్టణ అధ్యక్షులు సూర దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులే వక్తలు...తల్లిదండ్రులే ప్రేక్షకులు...

- నారాయణ స్కూల్ సత్తుపల్లిలో ఘనంగా ప్రీ ప్రైమరీ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి)














సత్తుపల్లి, అక్షిత న్యూస్:

నారాయణ స్కూల్ సత్తుపల్లిలో పిపి-1,పిపి-2 విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్‌ఎల్‌సి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులేవక్తలుగా,తల్లిదండ్రులే ప్రేక్షకులుగా పాల్గొని, విద్యార్థులు తమ ప్రతిభను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు వేదిక పై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించి, వివిధ కార్యకలాపాలు మరియు ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల చురుకుదనం, ఆత్మవిశ్వాసం, మాట్లాడే తీరు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఏజీఎం రాంకీ హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా వీక్షించి, చిన్నారులను అభినందించారు. అలాగే ఆర్ ఐ క్రాంతి, కోఆర్డినేటర్ నీలిమ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులకు కేవలంపాఠ్యపుస్తక జ్ఞానమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను వ్యక్తపరచే అవకాశాలను కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి ఎస్‌ఎల్‌సి వంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయనిపాఠశాల యాజమాన్యం పేర్కొంది.

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
బుధవారం 30 సెప్టెంబర్ 2026
www.aakshitha.com


# ప్రభుత్వ పథకాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :**
రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పథకాలను అధికారులు సమన్వయంతో పనిచేసి సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రీ-సర్వే, సాదాబైనామా, 22-ఎ, భూభారతి, రెవెన్యూ సదస్సులు, ప్రజావాణి, కళ్యాణలక్ష్మి - షాదిముబారక్, కోర్టు కేసులు, ఆర్ ఒ ఆర్ చట్టం, ఇసుక, భూసేకరణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియకు సంబంధించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేయడంతో పాటు,రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులు, 22-ఎ కు సంబంధించిన భూ సమస్యలు, భూభారతి ద్వారా అందుతున్న దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులు, ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి, అర్హత కలిగిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కోర్టు కేసులు, ప్రభుత్వానికి సంబంధించిన భూ వివాదాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఆర్ ఒ ఆర్ చట్టం క్రింద పెండింగ్‌లో ఉన్న రికవరీ కేసులను సమీక్షించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇసుక నిర్వహణ, రవాణా సంబంధిత అంశాలపై నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, అక్రమ రవాణాకు తావు లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించిన కేసులలో రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు, పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ అంశాలను నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, అన్ని విభాగాల పర్యవేక్షకులు, మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అభివృద్ధే లక్ష్యం.ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..




**కుత్బుల్లాపూర్, అక్షిత ప్రతినిధి :**
సైబరాబాద్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జూన్ దుండిగల్ సర్కిల్ పరిధి శంభీపూర్ ఎమ్మెల్సీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు..

# తాత జడ్పీటీసీ... తండ్రి సర్పంచ్...

## మూడో తరంలో కార్పొరేటర్ బరిలో పృథ్వీరాజ్!

- మూడు తరాల ప్రజాసేవా వారసత్వానికి కొత్త అడుగు
- రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు పయనం
- తాత తండ్రి అడుగుజాడల్లో ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు
- పటాన్‌చెరులో రాజకీయంగా పృథ్వీరాజ్‌పై ఆసక్తి



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి.**
ప్రజా సేవతో ముడిపడిన కుటుంబ నేపథ్యం...ప్రజలతో సత్సంబంధాలు.. సామాజిక సేవపై ఆసక్తి... యువతతో అనుబంధం.. ఇవన్నీ కలగలిసిన రాజకీయ కుటుంబం నుంచి మరో తరం నాయకత్వం తెరపైకి వస్తోంది.తాత జడ్పీటీసీగా ప్రజలకు సేవలందించారు.తండ్రి సర్పంచ్‌గా గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండారు. ఇప్పుడు అదే కుటుంబం నుంచి మూడో తరం ప్రతినిధిగా ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ రాజకీయ బరిలోకి ముందు వరుసలో ఉన్నారు.పటాన్‌చెరు డివిజన్‌లో కార్పొరేటర్ బరిలో నిలిచేందుకు పృథ్వీరాజ్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆయన రాజకీయ నేపథ్యం, కుటుంబానికి ఉన్న ప్రజా సంబంధాలు, సామాజిక కార్యక్రమాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

**తాత అడుగుజాడల్లో...**
ఒక కుటుంబంలో ప్రజా సేవా భావన ఒక తరంతో ముగియకుండా తర్వాతి తరాలకు కొనసాగితే, అది ఆ కుటుంబానికి ప్రత్యేకమైన రాజకీయ నేపథ్యాన్ని తీసుకొస్తుంది.పృథ్వీరాజ్ తాత జడ్పీటీసీగా పనిచేసిన సమయంలో ప్రజల సమస్యలను స్థానిక సంస్థల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేసినట్లు కుటుంబ వర్గాలు చెబుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో జడ్పీటీసీ పదవికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, మౌలిక వసతులు వంటి ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలు స్థానిక సంస్థల ద్వారా ముందుకు తీసుకెళ్లడంలో జడ్పీటీసీ పాత్ర ఉంటుంది.అలాంటి పదవిలో తాత పనిచేయడం పృథ్వీరాజ్ కుటుంబానికి ప్రజా జీవితంతో ఉన్న అనుబంధానికి తొలి అధ్యాయంగా కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

**తండ్రి సర్పంచ్‌గా.. ప్రజలతో మరింత దగ్గరగా...**
తాత తర్వాత పృథ్వీరాజ్ తండ్రి కూడా ప్రజా జీవితంలోకి వచ్చి సర్పంచ్‌గా సేవలందించారు.సర్పంచ్‌గా గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉండటంతో, కుటుంబానికి ప్రజలతో ఉన్న అనుబంధం మరింత బలపడిందని కుటుంబ వర్గాలు చెబుతున్నాయి.ప్రజల అవసరాలు తెలుసుకోవడం..వారి సమస్యలు వినడం...స్థానికంగా అందుబాటులో ఉండటం...అధికారులతో సమన్వయం చేయడం...గ్రామాభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టడం...ఇలా తండ్రి ప్రజా జీవితాన్ని కుటుంబంలో చిన్నప్పటి నుంచే గమనించిన పృథ్వీరాజ్‌కు ప్రజా సేవపై ఆసక్తి ఏర్పడిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

**మూడో తరం.. ఇప్పుడు పటాన్‌చెరు రాజకీయ బరిలో...**
తాత జడ్పీటీసీ..తండ్రి సర్పంచ్..ఇప్పుడు కుమారుడు పృథ్వీరాజ్...ఇది కేవలం ఒక రాజకీయ కుటుంబంలో తరాల మార్పు మాత్రమే కాదు. ప్రజా జీవితంలో కుటుంబం నుంచి కొత్త తరం నాయకత్వం ముందుకు రావడంగా స్థానికులు చూస్తున్నారు.ఇప్పటివరకు కుటుంబంతో కొనసాగిన ప్రజా సంబంధాలను మరింత విస్తృత స్థాయిలో కొనసాగిస్తూ, పటాన్‌చెరు డివిజన్ ప్రజల సమస్యలపై పనిచేయాలనే లక్ష్యంతో పృథ్వీరాజ్ ముందుకు సాగుతున్నారు.ఎండిఆర్ ఫౌండేషన్‌తో సామాజిక సేవ..రాజకీయ రంగంలోకి రావడానికి ముందే సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలనే ప్రయత్నం చేస్తున్నట్లు పృథ్వీరాజ్ పరిచయ వర్గాలు చెబుతున్నాయి.ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్‌గా సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ప్రజలతో మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు.సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకోవడం, వివిధ వర్గాల ప్రజలతో సంబంధాలను కొనసాగించడం పృథ్వీరాజ్ రాజకీయ ప్రయాణానికి ఒక ప్రత్యేకమైన నేపథ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.పటాన్‌చెరుతో కుటుంబానికి పాత అనుబంధం,పటాన్‌చెరు ప్రాంతంలో రాజకీయంగా ఎదగాలంటే కేవలం ఎన్నికల సమయంలో ప్రజలను కలవడం సరిపోదు.ప్రజలతో దీర్ఘకాలిక సంబంధాలు...కుటుంబాలతో పరిచయాలు...స్థానిక సమస్యలపై అవగాహన...వివిధ సామాజిక వర్గాలతో అనుబంధం...యువతతో సంబంధాలు...ఇవన్నీ కీలకంగా మారతాయి.పృథ్వీరాజ్ కుటుంబానికి గతం నుంచి ప్రజలతో ఉన్న పరిచయాలు,సత్సంబంధాలు తన రాజకీయ ప్రయాణానికి ఉపయోగపడతాయని ఆయన సన్నిహితులు భావిస్తున్నారు.

**యువతపై ప్రత్యేక దృష్టి...**




పటాన్‌చెరు వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం.కొత్త కాలనీలు...పెరుగుతున్న జనాభా...విద్యావంతులైన యువత...ఉద్యోగ, ఉపాధి అవకాశాల అవసరం...క్రీడలు, సామాజిక కార్యక్రమాలపై యువత ఆసక్తి...ఇలాంటి అంశాల్లో యువతను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం స్థానికంగా వినిపిస్తోంది.యువతతో సన్నిహితంగా ఉండే నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలనే ఆలోచనతో పృథ్వీరాజ్ పనిచేస్తున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి.ప్రజా సంబంధాలే రాజకీయ పునాది..పృథ్వీరాజ్ రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన అంశం ప్రజలతో ఉన్న సంబంధాలు.కుటుంబానికి గతంలో ఉన్న పరిచయాలను కొనసాగిస్తూ...కొత్త తరంతో సంబంధాలను పెంచుకుంటూ...సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతూ...పటాన్‌చెరు డివిజన్‌లో తనకంటూ ఒక రాజకీయ గుర్తింపు తెచ్చుకునేందుకు పృథ్వీరాజ్ ప్రయత్నిస్తున్నారు.

**గెలుపే లక్ష్యంగా.. కానీ ముందున్న పరీక్ష ప్రజల తీర్పే...**
తాత ప్రజాసేవ...తండ్రి స్థానిక రాజకీయ అనుభవం.. తన సామాజిక కార్యక్రమాలు..ప్రజలతో కొనసాగుతున్న సంబంధాలు. ఇవన్నీ కలిపి మూడో తరం రాజకీయ ప్రయాణానికి పృథ్వీరాజ్ పునాది వేసుకుంటున్నారు.అయితే రాజకీయాల్లో కుటుంబ నేపథ్యం ఒక పరిచయాన్ని ఇవ్వగలిగినా, ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం,అందుబాటులో ఉండటం, భవిష్యత్ ప్రణాళికను ప్రజలకు వివరించడం వంటి అంశాలు కూడా కీలకంగా ఉంటాయి. పటాన్‌చెరు డివిజన్‌లో కార్పొరేటర్‌గా పోటీ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న పృథ్వీరాజ్‌కు ఇప్పుడు ప్రజలతో తన అనుబంధాన్ని మరింత బలపరచుకోవాల్సిన సమయం.

**మూడు తరాలు.. ఒకే ప్రజాసేవా బాట...**
జడ్పీటీసీగా తాత...సర్పంచ్‌గా తండ్రి..కార్పొరేటర్ బరిలో కుమారుడు..ఇలా మూడు తరాలుగా ప్రజా జీవితంతో కొనసాగుతున్న అనుబంధం పృథ్వీరాజ్ రాజకీయ ప్రయాణానికి ప్రత్యేకమైన గుర్తింపుగా నిలుస్తోంది.తాత వేసిన ప్రజాసేవా బాటను..తండ్రి కొనసాగించిన స్థానిక ప్రజా సంబంధాలను..తన తరం సామాజిక ఆలోచనలు, యువతతో అనుబంధంతో ముందుకు తీసుకెళ్లాలన్నది పృథ్వీరాజ్ లక్ష్యంగా ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పటాన్‌చెరు డివిజన్‌లో కార్పొరేటర్ బరిలో మూడో తరం రాజకీయ అడుగు వేస్తున్న పృథ్వీరాజ్..కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ప్రజా సేవతో ముడిపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు ముందుకు సాగుతున్న యువ నాయకుడిగా ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నారు.తాత సేవా వారసత్వం... తండ్రి ప్రజా అనుబంధం... మూడో తరంగా పృథ్వీరాజ్ రాజకీయ అడుగు పటాన్‌చెరు రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న కొత్త పరిణామం. ఇవన్నీ రాజకీయంగా ముందుకు తీసుకెళ్తాయని సన్నిహిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికపై శిక్షణ

- ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు జలసిరి కార్యక్రమాలకు ప్రాధాన్యం

**రాయపర్తి అక్షిత ప్రతినిధి**
మండల కేంద్రంలోని రైతు వేదికలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారీ విధానంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిణామాలను అధిగమించేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, ఎండిపోయిన బోర్లకు రీచార్జ్ నిర్మాణాలు, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించే విధానాన్ని వివరించారు. అలాగే గ్రామపంచాయతీ భవనం, వివో భవనం, గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్, మరమ్మతులు తదితర మౌలిక వసతులను వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక లో చేర్చే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈ, ఏఈ, ఎంపీవో, ఏపీవో, ఈసీ, టీఏలు పాల్గొన్నారు.




# చిట్టీ పేరుతో "బాబు " చీకటి దందా

- అవసరమే ఆయుధంగా.. వడ్డీ వ్యాపారం!
- తనఖా పత్రాలు.. వడ్డీ వసూళ్ల దందా!
- చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలు.
- అనధికార అధిక వడ్డీ వసూళ్లపై చర్యలేవీ?
- ఏ పవర్ బస్తీలో తనని ప్రశ్నించే వాళ్లే లేరా!

కొత్తగూడెం, అక్షిత ప్రతినిధి:

అవసరంలో ఉన్న ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొత్తగూడెం పట్టణంలోని ఏ పవర్ బస్తీ లో చిట్టీ, ఫైనాన్స్ పేరుతో అధిక వడ్డీకి డబ్బులు ఇస్తూ, అనంతరం భారీ మొత్తాల్లో వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో స్థానిక కౌన్సిలర్ గా పనిచేసిన వ్యక్తి ఈ వ్యవహారం నడిపిస్తున్నాడు అని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ఈ అంశంపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. చిట్టీ వ్యాపారం, ఫైనాన్స్ కార్యకలాపాలకు సంబంధించి అవసరమైన అనుమతులు, రికార్డులు, లావాదేవీల వివరాలు ఉన్నాయా ? లేదా? అన్నదానిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.







**చిట్టీ పేరుతో లావాదేవీలు?**

చిట్టీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు సేకరించడం, అవసరమైన వారికి ఫైనాన్స్ పేరుతో నగదు ఇవ్వడం వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్న వ్యాపారులు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు, అత్యవసర ఆర్థిక అవసరాలు ఉన్నవారే ప్రధానంగా ఈ వ్యవహారాన్ని ఆశ్రయిస్తున్నారని సమాచారం. అవసరంలో ఉన్న సమయంలో సులభంగా డబ్బులు అందుతున్నప్పటికీ, తిరిగి చెల్లించే సమయంలో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.రూ. 50 వేలు అప్పు.. రూ. 75 వేలు చెల్లింపు? డైలీ ఫైనాన్స్ పేరుతో కొంత మొత్తాన్ని చేతికి ఇచ్చి, రోజువారీగా నిర్దిష్ట మొత్తాన్ని వసూలు చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. రూ.10 వేలు తీసుకున్న వ్యక్తి నుంచి వివిధ లెక్కల పేరుతో రూ.15 వేలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తం తిరిగి వసూలు చేస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. రోజువారీ చెల్లింపుల విధానంలో అసలు ఎంత? వడ్డీ ఎంత? మొత్తం ఎంత చెల్లించాలి? అనే విషయంలో అప్పు తీసుకున్నవారికి స్పష్టత లేకుండా పోతోందని బాధితులు వాపోతున్నట్లు సమాచారం.

**అప్పు ఒకరిది.. ఒత్తిడి కుటుంబం మొత్తంపై?**

అప్పు తీసుకున్న వ్యక్తి చెల్లింపులో ఆలస్యం చేస్తే వసూళ్ల ఒత్తిడి పెరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పు తీసుకున్న వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను సంప్రదించి డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.కొన్ని సందర్భాల్లో మహిళల ఇళ్లకు వెళ్లి వసూళ్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ అంశాలపై బాధితుల నుంచి అధికారిక ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**తనఖా పత్రాలు.. వాహనాల పేరుతో ఫైనాన్స్?**

ఫైనాన్స్ పేరుతో డబ్బులు ఇచ్చే సమయంలో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, వాహనాల వివరాలు లేదా ఇతర భద్రతా పత్రాలు తీసుకుంటు న్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.చిట్టీ, ఫైనాన్స్ కార్యకలాపాల్లో ఎంత మొత్తంలో డబ్బు తిరుగుతోంది? ఎవరెవరికి అప్పులు ఇస్తున్నారు? ఎంత వడ్డీ వసూలు చేస్తున్నారు? ఏ రికార్డులు నిర్వహిస్తున్నారు? అన్న అంశాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**వసూళ్లకు ప్రత్యేక వ్యవస్థ?**

ఉదయం ప్రారంభం నుంచి రోజువారీ వసూళ్లే ప్రధాన కార్యకలాపంగా మారుతున్నాయన్న ఆరోపణ లు ఉన్నాయి. ఫైనాన్స్ తీసుకున్న వ్యక్తుల నుంచి ప్రతిరోజూ నిర్దిష్ట మొత్తాన్ని వసూలు చేస్తున్నారని, ఒకరోజు చెల్లింపు ఆలస్యమైనా ఒత్తిడి పెరుగు తోందని కొందరు చెబుతున్నారు. దీంతో చిన్న వ్యాపారులు తమ రోజువారీ ఆదాయంలో గణనీయ మైన మొత్తాన్ని అప్పు చెల్లింపులకే కేటాయించాల్సి వస్తోందని, వ్యాపారం కోసం అవసరమైన పెట్టుబడి తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిఘా ఎక్కడ?**

కొత్తగూడెం పట్టణంలో చిట్టీ, ఫైనాన్స్ పేరుతో పెద్ద మొత్తాల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**చిట్టీ వ్యాపారానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా?**

ఫైనాన్స్ కార్యకలాపాలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? ఎంత మొత్తంలో లావాదేవీలు జరుగుతు న్నాయి?ఎంత వడ్డీ వసూలు చేస్తున్నారు? బాధితుల నుంచి ఎలాంటి పత్రాలు తీసుకుంటున్నారు? రోజు వారీ వసూళ్లకు ఎలాంటి లెక్కలు నిర్వహిస్తున్నారు. అన్న అంశాల పై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**రికార్డులు పరిశీలిస్తే అసలు లెక్కలు బయటకు?**

చిట్టీ, ఫైనాన్స్ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది అధికారుల విచారణతోనే తేలాల్సి ఉంది. బాధితుల వద్ద ఉన్న రసీదులు, ప్రామిసరీ నోట్లు, తనఖా పత్రాలు, బ్యాంకు లావా దేవీలు, డిజిటల్ చెల్లింపుల వివరాలు, రోజువారీ వసూళ్ల రికార్డులను పరిశీలిస్తే అసలు లెక్కలు బయటపడే అవకాశం ఉంది.అధిక వడ్డీ వసూళ్లు, బెదిరింపులు లేదా కుటుంబ సభ్యులపై ఒత్తిళ్లు వంటి ఆరోపణలు నిజమైతే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చిట్టీ.. ఫైనాన్స్ వ్యవహారంపై విచారణకు డిమాండ్ అవసరంలో ఉన్న ప్రజలకు ఆర్థిక సహాయం పేరుతో జరుగుతున్న చిట్టీ, ఫైనాన్స్ వ్యవహారాలు నిబంధనల కు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అన్నదానిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతు న్నారు. కొత్తగూడెంలో ఏ పవర్ బస్తీ కేంద్రంగా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఈ చిట్టీ, ఫైనాన్స్ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

# త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభం

- డబుల్ బెడ్‌రూం ఇళ్లపై సర్వే.. అర్హులైన నిరుపేదలకు అందేలా చర్యలు
- జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్‌తో చర్చలు

వరంగల్, అక్షిత బ్యూరో:

విపక్షాలు ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే అవకాశం ఇవ్వకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మాజీ మంత్రి కొండా సురేఖ తూర్పు నియోజకవర్గ నాయకులకు సూచించారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 111 మంది లబ్ధిదారులకు రూ.61,61,200 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

**నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండ**

డబ్బులు లేక వైద్య చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందని సురేఖ అన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల ప్రజలు సీఎంఆర్ఎఫ్ కోసం తనను కలిసేవారని, అర్హులందరికీ చెక్కులు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కల్యాణలక్ష్మి చెక్కులు కూడా త్వరలో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**అభివృద్ధి పనులు త్వరలో పూర్తి**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎనిమిది అంతస్తుల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. నూతన కలెక్టరేట్ భవనం పనులు కాంట్రాక్టర్ చెల్లింపుల విషయంలో జాప్యం కారణంగా ఆలస్యమవుతున్నాయని, త్వరలోనే దానిని కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 99 శాతం దేవాలయాల అభివృద్ధి పనులకు ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు.

**డివిజన్లలో సమస్యలపై ప్రత్యేక దృష్టి**

వారం రోజుల తర్వాత డివిజన్లలోని స్థానిక నాయకులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. వారానికి ఒకరోజు డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటామని, అవసరమైతే



అధికారులను అక్కడికే పిలిపించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని నాయకులు డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. మంత్రి పదవి పోయిందని తాను ఏమాత్రం బాధపడటం లేదని చెప్పారు. రాష్ట్రంలోని ఉన్నతాధికారులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, వరంగల్ అభివృద్ధికి వారి సహకారం తీసుకుంటామని తెలిపారు. 24 మంది కార్పొరేటర్లే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్,మాజీ కార్పొరేటర్ లు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో 25వ రక్తదాన శిబిరం ప్రారంభం...

అక్షిత జగిత్యాల ప్రతినిధి-సెప్టెంబర్ 29



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జగిత్యాల IMA భవన్ లో "డొనేట్ బ్లడ్ -- సేవ్ లైవ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 25వ రక్తదాన శిబిరాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు ప్రారంభించారు. అనంతరం రక్త దాత లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ద్వారా రోడ్డు ప్రమాదాలు,ప్రసూతి,రక్తానికి సంబంధించిన వ్యాధులు ఇతర సమయాల్లో ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నిరంతరం శిబిరాలు నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులను అభినందించారు.మానవ సేవ మాధవ సేవ అందరూ భావించాలి అన్నారు.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ DMHO శ్రీనివాస్,ఐఎంఏ సెక్రటరీ అకుతోట శ్రీనివాసరెడ్డి,కోశాధికారి డా.సుధీర్,కౌన్సిలర్ ప్రశాంత్ రావు, డా.నాగరాజు,డా.శంకర్,డాకృష్ణ మూర్తి,విమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , వైద్యులు, నాయకులు, ఐఎంఏ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో హృదయ ఆరోగ్యం పై అవగాహన కల్పించాలి

- కౌన్సిలర్ మునవత్ పార్వతి తర్యా నాయక్




మేడ్చల్, అక్షిత ప్రతినిధి:

ప్రపంచ హార్ట్ దినోత్సవం సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపల్ ఘనపూర్ లో మెడిసిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో హృదయ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మునవత్ పార్వతి తర్యా నాయక్ నేటి జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసు కోవడం, పొగతాగడం మరియు ఇతర అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో హృదయ ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడి డా.ఇనాక్షి, ప్రొఫెసర్ పవన్ శర్మ, డాక్టర్స్ సమీర్, అజిల, ఐశ్వర్య, స్వప్న, మార్కెటింగ్ మేనేజర్ కుమారస్వామి, సంజయ్ నాగార్జున, నవీన్, రాజు, చేరాలు, సాయికుమార్, బాలకృష్ణ, మల్లికార్జున్, కవిత, అభిషేక్ , మెడిసిటి హాస్పటల్ వైద్య సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



చొప్పదండి అక్షిత న్యూస్

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామంలోని రామలింగంపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల పట్ల గౌరవం, ప్రేమ, ఆప్యాయతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. "నేను, నా కుటుంబం,సమాజంలోని వృద్ధులను జీవితాంతం గౌరవిస్తూ, ప్రేమిస్తూ, శ్రద్ధగా చూసుకుంటాను. వారి జ్ఞానాన్ని, అనుభవాన్ని గౌరవిస్తూ వారికి అండగా నిలబడతాను. వృద్ధుల హక్కులు, అవసరాల కోసం వారి గొంతుకగా నిలుస్తాను" అంటూ ప్రతిజ్ఞ చేశారు.అలాగే వృద్ధుల హక్కులు,వారి ప్రయోజనాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వృద్ధులపై జరిగే అన్యాయాలు, నిర్లక్ష్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. వృద్ధులు ప్రేమ, గౌరవం, ఆత్మగౌరవంతో జీవించేలా సమాజాన్ని నిర్మించేందుకు అందరితో కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వయోవృద్ధులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వృద్ధులను కుటుంబ సభ్యులు, సమాజం గౌరవంగా చూసుకోవాలని సూచించారు. వారి అనుభవం, జ్ఞానం భావితరాలకు ఎంతో విలువైనదని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త గుళ్లపల్లి రమాదేవి, ఆశా వర్కర్‌తో పాటు పలువురు వయోవృద్ధులు, మహిళలు పాల్గొన్నారు.


## మత్తు పదార్థాలు వినియోగానికి దూరంగా ఉండాలి




వరంగల్, అక్షిత బ్యూరో:

వరంగల్ దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నాషా ముక్తి యువ వికసిత్ భారత్ 100 వారాల నాశముక్తి యువ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ యువత మత్తు ప్రదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల పై విద్యార్థులు యువతలో విస్తృతంగా అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవన్ ఉపాధ్యాయులు అరుణ లావణ్య శైలజ, ఫిజికల్ డైరెక్టర్ నిశాంత్ వైద్య సిబ్బంది పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెలు, కుమారస్వామి,శోభ,ప్రమీల విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జైలర్ 2 లో అనిరుధ్ జైలర్ టైటిల్ ట్రాక్




2023లో విజయవంతమైన చిత్రం 'జైలర్'కు సీక్వెల్ అయిన 'జైలర్ 2' కోసం ఉత్సాహం పెరుగుతోంది. ఈ చిత్రంలో రజనీకాంత్ ముత్తువేల్ 'టైగర్' పాండియన్ పాత్రలో నటించగా, విద్యా బాలన్ మరియు ఇతరులు ఆయనతో పాటు నటిస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 15, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీని ప్రమోషన్లలో భాగంగా సెప్టెంబర్ 29-30 తేదీలలో 'వన్ నేమ్' లిరిక్ వీడియో, అక్టోబర్ 5న ఒక గ్రాండ్ ట్రైలర్, మరియు ప్రత్యేక ఫ్యాన్ ఈవెంట్‌లు జరగనున్నాయి. కన్నడ డబ్బింగ్ ముగింపు దశకు చేరుకుంటుండగా మరియు జర్మనీ వంటి అంతర్జాతీయ విడుదలలకు సన్నాహాలు జరుగుతుండగా, అభిమానులు భారీ సమావేశాలు, యానిమే ఆర్ట్ వంటి సృజనాత్మక నివాళులు, మరియు వ్యక్తిగత సంభాషణల వీడియోలను పంచుకుంటున్నారు. ఇవి అధికారిక ప్రచారంతో పాటు సహజమైన ఉత్సాహాన్ని కూడా మేళవిస్తున్నాయి. ఇదిలా వుండగా, గతంలో అనిరుద్ సాంగ్స్ అంటే వచ్చే పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వీటికి రాలేదు. కానీ నేడు రానున్న అవైటెడ్ జైలర్ టైటిల్ ట్రాక్ మాత్రం యునానిమస్ స్పందన అందుకోవడం గ్యారెంటీ అనిపిస్తుంది. ఈ టైటిల్ ట్రాక్ ఆల్రెడీ పార్ట్ వన్ లో హిట్ అయింది. సీక్వెల్ విషయానికొస్తే ఈ ప్రాజెక్టుని అనౌన్స్ చేసినప్పుడు విడుదల చేసిన ప్రోమో కట్ లో అనిరుద్ ఇచ్చిన రీమిక్స్ కి సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. సో జైలర్ 2 నుంచి ఇప్పుడు వరకు వచ్చిన రెండు సాంగ్స్ కంటే ఇది బెటర్ గా ఉండడమే కాకుండా అంచనాలు కూడా పెంచుతుంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## రకుల్ ప్రీత్ సింగ్‌పై ఐటీ దాడులు..

ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ గారు, ప్రముఖ నిర్మాత వషు భగ్నానీ, వారికి సంబంధించిన పనోరమ స్టూడియోస్‌తోపాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఏకకాలంలో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు



నిర్వర్తిస్తున్నారు. ముంబైలో సోదాలు వ్యవహారం బయటకు రావడంతో ఒక్కసారిగా బాలీవుడ్ సినీ పరిశ్రమలోని ప్రముఖులు ఉలిక్కిపడ్డారు. రకుల్ ప్రీత్ ఫ్యామిలీ నివాసాలు, కార్యాలయాలపై దాడులు నిర్వహించడం వెనుక కారణాలను ఆరా తీశారు. ఈ వ్యవహారం బాలీవుడ్ మీడియాలో కలకలం రేపింది. రకుల్ ప్రీత్ సింగ్, ఆమె భర్త జాకీ భగ్నానీ, వషు భగ్నానీపై ఆదాయపు పన్ను ఎగవేత, నిధుల నిర్వాహణలో అవతకవలు, మనీ లాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారంటూ వారి భాగస్వాములు, పెట్టుబడి దారులు ఆరోపణలు, ఫిర్యాదు చేయడంతో ముంబై ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అంటే సెప్టెంబర్ 28వ తేదీ ఉదయం నుంచే ఐటీ అధికారులు ముంబైలోని పలు ప్రదేశాల్లో దాడుల చేసి సోదాలు చేస్తున్నారు. వారి నిధులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ వ్యవహారాలు, ఓవర్సీస్‌లో ఫైనాన్షియల్ ట్రాన్స్‌జాక్షన్ వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. జాతీయ టెలివిజన్ ఛానెల్ ఎన్డీటీవీ వెల్లడించిన కథనం ప్రకారం.. సినిమాల నిర్మాణానికి సంబంధించి ఫైనాన్స్ వ్యవహారాలు, విదేశాలకు అక్రమంగా తరలించిన డబ్బు విషయంపై వెలుగు చూసిన అవకతవకల గురించి, ఇతర ఫైనాన్స్ వ్యత్యాసాల గురించి ప్రశ్నిస్తున్నారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు అని తెలిపింది. అయితే ఈ దాడులకు సంబంధించిన వివరాలు అందాల్సి ఉంది. ఈ రైడ్స్‌పై రకుల్ గానీ, భగ్నానీ కుటుంబం గానీ స్పందించలేదు. వషు భగ్నానీ విషయానికి వస్తే.. బాలీవుడ్‌లో అగ్ర నిర్మాతగా పేరు సంపాదించారు. ఆయన పూజా ఫిలింస్ అనే బ్యానర్‌పై పలు చిత్రాలను నిర్మించారు. పంపిణీ రంగంలో కూడా ఉన్నారు. అయన కుమారుడు ప్రస్తుతం తమ సంస్థ వ్యవహారాలను చూసుకొంటున్నారు. ఇటీవల జాకీని రకుల్ ప్రీత్ సింగ్ ప్రేమించి పెళ్లి చేసుకోవడం తెలిసిందే. ఇటీవల వారి సంస్థ హై జవానీతో ఇష్క్ హోనా హై సినిమాను రిలీజ్ చేయడం తెలిసిందే.




## క్రేజ్ పెంచేసిన సత్యదేవ్ సమవర్తి టీజర్

సత్యదేవ్ హీరోగా "సమవర్తి" అనే ఇంట్రెస్టింగ్ సినిమాలో నటిస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ ఒ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన "సమవర్తి" టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ టీజర్ కు ఇప్పటిదాకా కోటికి పైగా డిజిటల్ వ్యూస్ దక్కాయి. "సమవర్తి" టీజర్ బిజినెస్ సర్కిల్స్ లో మూవీపై క్రేజ్ పెంచేసింది. ఈ సినిమాకు భారీ స్థాయిలో బిజినెస్ ఎంక్వైరీస్ జరుగుతున్నాయి. టీజర్ లో పరిచయం చేసిన "సమవర్తి" ప్రపంచం ప్రతి ఒక్కరినీ మెస్మరైజ్ చేస్తోంది. సత్యదేవ్ కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందనే అంచనాలు టీజర్ తోనే ఏర్పడ్డాయి. మేకర్స్ ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరిన్ని ఎగ్జైటింగ్ అప్డేట్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు "సమవర్తి" టీమ్ సన్నద్ధమవుతోంది. నటీనటులు – సత్యదేవ్, శ్రీకాంత్, దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్, తదితరులు

## ఆచీతూచీ పాత్రలవైపు జాన్వీ కపూర్ అడుగులు

జాన్వీ కపూర్ ప్రస్తుతం ఆచీతూచీ పాత్రలను ఎంచుకుంటున్నారు. పెద్ది చిత్రం విడుదలైన తర్వాత, ఆమె హైదరాబాద్‌లోని ప్రచార కార్యక్రమాలకు, బహిరంగ వేదికలకు దూరంగానే ఉంటున్నారు. పెద్ది చిత్రంలో తన పాత్రను, ముఖ్యంగా గ్లామరస్ కోణంలో చూపించిన విధానం పట్ల జాన్వీ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే, ఆ సినిమాకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాల్గొనడాన్ని పరిమితం చేసుకున్నారు. బాలీవుడ్‌లో కూడా జాన్వీ శరవేగంగా ప్రాజెక్ట్‌లకు సైన్ చేసేలా కనిపించడం లేదు. ఆమె తన కెరీర్ తదుపరి దశను అంచనా వేయడానికి సమయాన్ని వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. సాంప్రదాయిక ఆకర్షణీయమైన, వాణిజ్య పాత్రలకు మించి కనిపిస్తుంది. ఇంకా బలమైన పాత్రలను అందించే మరిన్ని పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పార్ట్‌లను తీసుకోవడానికి ఆసక్తి చూపుతుందని తెలుస్తోంది. ఆమె అల్లు అర్జున్ రాకాకు సంతకం చేసిందని టాక్ వస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో ఆమె ప్రమేయం గురించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన లేదు. ప్రస్తుతానికి, జాన్వి తన కెరీర్ ఎంపికల విషయంలో మరింత జాగ్రత్త తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.






## కామ్రేడ్ కళ్యాణ్ రివల్యూషనరీ సాంగ్

శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు.శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి ఎత్తర ఎత్తు సాంగ్ లాంచ్ చేశారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నటీనటులు: శ్రీవిష్ణు, మహిమా నంబియార్, రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


# ప్రభుత్వాసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందించాలి





**- నిర్వహణ, పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**
**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్, అక్షిత ప్రతినిధి :

ప్రభుత్వాసుపత్రులకు వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఓపీ, ఐపీ, రోగుల నమోదు, సాధారణ వైద్య సేవలు, ప్రసూతి విభాగం, రక్త పరీక్షల విభాగం, మందుల గదిని పరిశీలించారు. ఆయా విభాగాల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది అందుబాటుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరై రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలనిసూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన వైద్యం, మందులు అందించాలని తెలిపారు. అవసరమైన వారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, చికిత్సకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు, అదనపు అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ సుజాత, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్ హుస్సేన్, వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రపంచ గుండె దినోత్సవ వేడుకలు

కరీంనగర్ అక్షిత బ్యూరో

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రణాళికలను రూపొందించాలని మరియు వాటి అమలుకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని "అల్ఫోర్స్" విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని లిఅల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యా సంస్థలు మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మరియు రెనీ హాస్పిటల్ వారి సంయుక్త సహకారంతో ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి సిపిఆర్ ప్రదర్శన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకను ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ వారు సంయుక్తంగా నిర్వహిస్తాయని చెప్పారు. గుండె జబ్బుల వల్ల కలిగే ప్రమాదాలు గురించి ప్రజలకు తెలియజేయడం మరియు నివారణ చర్యలను వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు చెప్పారు.రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లేదా నడవడం ద్వారా గుండెను జాగ్రత్తగా ఉంచుకోవచ్చని తెలిపారు . యోగా ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని




తగ్గించుకోవచ్చని మరియు గుండెను కాపాడుకోవచ్చని చెప్పారు డాక్టర్ బంగారి స్వామి , చైర్మన్, రెనీ హాస్పిటల్స్ మాట్లాడుతూ ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని గుండె జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తారని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల వారితో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయమని మరియు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేతకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. సిపిఆర్ విధానాన్ని డాక్టర్ బి.దీక్షిత్ చాలా చక్కగా వర్ణించాడు. వార్షిక ప్రణాళికలో భాగంగా దీనిని పొందుపరచాలని వారు అభిప్రాయపడ్డారు



మరియు ప్రభుత్వానికి సూచించారు. ఈ విధానం ద్వారా ఎంతో మంది జీవితాలను కాపాడవచ్చని వారు చెప్పారు ఈ కార్యక్రమంలో డాక్టర్ బంగారు స్వామి, చైర్మన్, రెనీ హాస్పిటల్స్, డాక్టర్ ఆకుల శైలజ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు, డాక్టర్ ఎన్.మహేష్ బాబు, కార్యదర్శి, ఐఎంఏ కరీంనగర్, డాక్టర్ వి.నీలిమ, కోశాధికారి, ఐఎంఏ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బి.దీక్షిత్, డాక్టర్ సారంగ్, ఆచార్య వడ్లూరి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, కరీంనగర్, ఎం అరవింద్ బాబు, ప్రతినిధి – రెనీ హాస్పిటల్స్, పవన్ ప్రసాద్, జనరల్ డైరెక్టర్ – రెనీ హాస్పిటల్స్,పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# భారతీయ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి




**- ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, అండర్-17 మల్కంబ్ ఎంపిక పోటీలు..**
**- మల్లఖంబు రాష్ట్రస్థాయి క్రీడలకు ట్రినిటీ విద్యార్థులు..**
**- మండల విద్యాధికారి ఈ. గురువారావు**

చౌటుప్పల్/ అక్షిత న్యూస్

మల్ల ఖంబ్ లాంటి భారతీయ సాంప్రదాయ క్రీడలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని మండల విద్యాధికారి ఈ గురువారావు అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, అండర్-17 బాల, బాలికల మల్కంబ్ ఎంపిక పోటీలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17 విభాగాల బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారుల ప్రతిభ, నైపుణ్యం, క్రీడా ప్రదర్శన ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ మల్కంబ్ పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా

ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ..

మల్కంబ్ క్రీడ విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, సమతుల్యత, ఏకాగ్రత, చురుకుదనం మరియు క్రమశిక్షణ పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే ఈ ఎంపిక పోటీల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, మల్కంబ్ వంటి భారతీయ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ పోటీలకు అండర్ -14 బాలికల విభాగంలో ఎన్ వైష్ణవి, ఎం మేఘన, పి హరిని, కే కావ్య శ్రీ, హర్షిత, నిత్యశ్రీ,అండర్- 14 బాలుర విభాగంలో బి చరణ్, వేదమానస్,డి యశ్వంత్, విగ్నేష్, సంజయ్ కుమార్, బి ఆదిత్య, అండర్ -17 బాలుర విభాగంలో దీక్షిత్, యు రాధే శ్యామ్, పి శశాంక్,జి చిద్విలాస్, కే కరణ్,ఏ సాయి కార్తీక్, అండర్ 17- బాలికల విభాగంలో ఏ ఆకాంక్ష, ఎన్ మోక్షిత,కే. కృతిక,ఏ వైష్ణవి,ఎస్.సహిత,జి ప్రణవి లు అర్హత సాధించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల ఎంఈఓ గురువారావు, పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య, జెడ్పీహెచ్ఎస్ కోయిలగూడెం పాఠశాల ఉపాధ్యాయులు మట్టయ్య , ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్,వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# పి.ఏ.సి.ఎస్ సర్వసభ్య సమావేశం



చౌటుప్పల్/ అక్షిత న్యూస్

చౌటుప్పల్ పిఏసిఎస్ సర్వసభ్య సమావేశంను మంగళవారం సంఘ చైర్మన్ ఈడుదుల మస్తాన్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి వై రమేష్ అంచనా ఆదాయాలు, జమా ఖర్చులను చదివి వినిపించగా సర్వసభ్య సమావేశం ఆమోదించింది. యూరియా, కాంప్లెక్స్ ఎరువులను యాప్ ల ద్వారా కాకుండా డైరెక్ట్ గా అమ్మాలని, యూరియా లారీ ట్రాన్స్పోర్ట్ గతంలో లాగా కేంద్ర ప్రభుత్వమే భరించాలి, పిల్లాయిపల్లి కాల్వ ద్వారా అన్ని గ్రామాల చెరువులను సాగినీటిని నింపాలి. ఎలినినో ప్రభావం వల్ల చౌటుప్పల్ మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున చౌటుప్పల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి, ముందస్తుగానే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వాటిని శుభ్రపరచాలని తీర్మానంలో ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి, డైరెక్టర్లు బొబ్బిళ్ళ రాజేందర్, నల్ల నరేందర్ రెడ్డి, జక్కడి వెంకటరెడ్డి, రావుల స్వామి, ఎర్ర పెంటయ్య, పానుగోతు లచ్చిరాం, మల్కాపురం సుగుణమ్మ,మేకల దేవేందర్ రెడ్డి,బత్తుల శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్లు చిమ్ముల వెంకట్ రెడ్డి, ఢిల్లీ చంద్రకళ, కరంటోతు శంకర్ నాయక్, శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం చైర్మన్ కె అశ్విన్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ లు సి.సంజీవరెడ్డి,సిహెచ్ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ బి కృష్ణారెడ్డి, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ కే సురేష్, సర్పంచులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల సేవలు మరువలేనివి

**- మునిపంపుల అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం**



రామన్నపేట అక్షిత ప్రతినిధి:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మునిపంపుల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏలూరి అనిత, యధాసు శోభ, బాదే మంజులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు సమాజ ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నేటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో వారి సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వనం అంజయ్య, సీనియర్ నాయకులు మన్నెం పద్మారెడ్డి, గోపగోని ధర్మరాజు, మండల ఉపాధ్యక్షుడు బట్టే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి వలలో రెవిన్యూ అధికారి

**- అవినీతికి చెక్ పెట్టేందుకు ఏసీబీ దూకుడు**
**- రూ.15 వేల లంచం తీసుకుంటూ**
**- ఏసీబీకి చిక్కిన నాంపల్లి (ఆర్ ఐ) గోపరాజు**

నాంపల్లి, అక్షిత న్యూస్:



నల్గొండ జిల్లా నాంపల్లి రెవెన్యూ కార్యాలయంలో అవినీతి బాగోతం వెలుగుచూసింది. నాంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గోపరాజు తన అసిస్టెంట్ ద్వారా ఓ రైతు నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కినట్లు సమాచారం. ఓ రైతు నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందడంతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు తెలిసింది. ఫిర్యాదుదారుడి నుంచి రూ.15 వేల నగదు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను పట్టుకున్నట్లు సమాచారం. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు సమాచారం.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక


## కొయ్యలగూడెంలో దివిస్ ఉచిత వైద్య శిబిరం



చౌటుప్పల్ /అక్షిత న్యూస్

చౌటుప్పల్ మండల పరిధి, కొయ్యలగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జయంత్ కుమార్,డాక్టర్ నరేష్ లు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి బృందంచే కంటి పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలిపారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలకు దివిస్ పరిశ్రమ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అలాగే 2,68,356 రూపాయల విలువ గల రాత పుస్తకాలను గ్రామ సర్పంచి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ దుర్గయ్య,ఎం యాదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, దివిస్ ప్రతినిధులు బి గోపి,జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



రామన్నపేట అక్షిత ప్రతినిధి:

రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాల్లో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రామన్నపేట వ్యవసాయ అధికారి ఏజాజ్ అలీ ఖాన్, రామన్నపేట మండల పరిశీలన అధికారిగా ఉన్న బీబీనగర్ వ్యవసాయ అధికారి సిహెచ్. పద్మతో కలిసి మండలంలోని పలు ఎరువుల షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఎరువుల నిల్వలు, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, నకిలీ ఎరువులు విక్రయించే డీలర్ల పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా డీలర్ నుండి బిల్లు, రశీదు తీసుకోవాలని, నకిలీ ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యత లేని ఎరువులు, అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలువురు డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## పబ్బు రాజు గౌడ్ ను పరామర్శించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



చౌటుప్పల్- అక్షిత న్యూస్

మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి శనివారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం దండు మల్కాపురం గ్రామంలోని పబ్బు రాజు గౌడ్ స్వగృహంకు విచ్చేసి పబ్బు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి,మాజీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహ్మా గౌడ్, ఆంధోల్ మైసమ్మ దేవాలయం చైర్మన్ కంచర్ల అశ్విని రెడ్డి,కౌన్సిలర్ బద్రి గాలయ్య,మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, వార్డు సభ్యులు పక్కిరు వంశీధర్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి,దొనకొండ కృష్ణ లు పాల్గొన్నారు.

# వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ప్రక్రియకు సంసిద్ధం

- జిల్లాలో 518 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- గ్రేడ్ ఏ ధాన్యానికి - 2461
- కామన్ రకానికి- 2441
- 07 రకాల సన్న వెరైటీ విత్తనాలకు
- 500 రూపాయల బోనస్
- మిల్లర్ల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సవ్యంగా నిర్వహణ
- కేంద్రాల్లో అన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్





మెదక్ అక్షిత బ్యూరో:

ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి కాన్ఫరెన్స్ హాల్లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డీఆర్డీఓ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికా బద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను సంసిద్ధంగా తయారు చేసినట్లు చెప్పారు. 2026-27 సంవత్సరానికి గాను జిల్లాలో 03 లక్షల 20వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేసినట్లు అంచనా వేసినట్లు వివరించారు. దొడ్డు రకం -413, సన్న రకం-105 కేంద్రాలు మొత్తం 518 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేడ్ ఏ ధాన్యానికి-2461, సాధారణ రకం-2441 ధర నిర్ణయించినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఐకేపీ 174, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-300 , సహకార మార్కెటింగ్ సొసైటీ -12 ,ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్- రైతు ఉత్పత్తిదారుల సంస్థ). ఆధ్వర్యం లో -32 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారురాష్ట్రంలో ప్రోత్సాహం కోసం ఏడు ప్రాధాన్య వరి రకాలను గుర్తించామన్నారు. బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, సోనా,జై శ్రీరామ్ , కెఎన్ఎం 1638, వరంగల్ 44,కెఎన్ఎం 7715. వివిధ రకాల సన్న రకం వడ్ల బోనస్ లపొందుపరిచినట్లు తెలిపారు టార్పాలిన్లు-14353, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్-06,తేమ కొలిచే యంత్రాలు-655, అందు బాటులో ఉంచామన్నారు, గన్ని బ్యాగ్స్ -51 లక్షల 75000 ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు ప్రభుత్వాదేశాల మేరకు తీసుకునే విధంగా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదనంగా ఉన్న ప్యాడిని ఇంటర్మీడియట్ గోడౌన్లో స్టోరేజ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం రవాణా చేసే లారీలకు నిబంధనల ప్రకారం ఖచ్చితంగా జీపీఎస్ (లేదా) వాహన స్థాన నిర్ధారణ వ్యవస్థను అమర్చాలని, తద్వారా ధాన్యం మళ్లింపును అరికట్టవచ్చని అన్నారు. అలాగే వరికోత మిషన్లను ముందస్తుగా పరిశీలించి, వాటి ఫిట్‌నెస్, భద్రతను సరిచూడాలని రవాణా శాఖ అధికారులకు స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించేందుకు టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, తగినన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ట్రక్కుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేయడంలో సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా క్షేత్రస్థాయి లో గోదాములను పరిశీలించాలని, వాటి సామర్థ్యాన్ని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి, వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణ సాఫీగా సాగేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను విజయవంతంగా చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ,డిఆర్డిఓపి డి శ్రీనివాసరావు, సహకార శాఖ అధికారి పద్మ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్ ,రవాణా శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవు...

- మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ...
- జాతీయస్థాయి నాయకుల నుండి గ్రామీణ స్థాయి కార్యకర్త వరకు అందరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది...
- ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం..
- ప్రతి ఒక్కరూ పార్టీ లైన్లోనే ఉండాలి...
- లైన్ దాటితే ఉపేక్షించేది లేదు..
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి తన భాష మార్చుకోవాలి..
- నేను కిందిస్థాయి కార్యకర్తనుండే జిల్లా అధ్యక్షుని వరకు ఎదిగాను...
- జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య



అక్షిత జగిత్యాల ప్రతినిధి-సెప్టెంబర్ 29

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ లో ఎలాంటి వర్గ విభేదాలు లేవని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య అన్నారు.. ఆయన మాట్లాడుతూ మా పార్టీ లో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుంది జాతీయస్థాయి నాయకులు నుండి గ్రామీణ స్థాయి కార్యకర్త వరకు అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం.. ప్రతి ఒక్క కార్యకర్త వారి అభిప్రాయాలను నిర్మోహమాటంగా చెప్పే వెసులుబాటు కేవలం కాంగ్రెస్ పార్టీలో మాత్రమే ఉంది.. ఇతర ఏ పార్టీలో కూడా సామాన్య కార్యకర్తకు గొంతు విప్పి మాట్లాడే అవకాశం ఉండదు. ఇది తెలియని కొందరు ఇతర పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ లో అంతర్గత విభేదాలు ఉన్నాయని మాట్లాడుతున్నారు ఇది సమంజసం కాదు. పార్టీ అధికారంలోకి రావడానికి పని చేసిన ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తిస్తాం.. నేను సామాన్య కార్యకర్తగానే నా ప్రస్థానాన్ని మొదలు పెట్టాను.. నా యొక్క కృషి అంకితభావం వల్ల ఈరోజు ఈ పదవి లభించింది.. పదవి అనేది అలంకారం కాదు.. పదవి బాధ్యతను పెంచుతుంది.. పార్టీలోకి కొత్త నీరు వస్తుంది.. పాత నాయకులు కార్యకర్తలు కొత్తవారిని స్వాగతించాలి వారితో కలిసి సమన్వయంతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఉంది.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఒంటెద్దు పోకడలను ఎండగట్టి రాష్ట్రంలో ఎన్నో కష్టాలను నష్టాలను ఓర్చుకొని ఎందరో కార్యకర్తల కృషి ఫలితంగా ఈరోజు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో దుర్భర స్థితిలో ఉంది. అయినా కూడా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం.. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో రేవంత్ సారథ్యంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది..

**జిల్లాలోని ఐదు నియోజకవర్గాలను గెలుచుకుంటాం..**

జగిత్యాల జిల్లాలో నేను అధ్యక్షునియ్యాక జరిగిన సర్పంచ్ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌కు కనీసం పోటీ కూడా ఇవ్వలేక పోయాయి.. కొన్ని అనివార్య కారణాల వలన జగిత్యాల బల్దియాలో కొన్ని కౌన్సిల్ స్థానాలను కోల్పోవడం జరిగింది.. అలాంటి తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకుంటాం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలోని ఐదు నియోజక వర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం...

**జీవన్ రెడ్డి తన భాష మార్చుకోవాలి..**

మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఇటీవల తన ప్రసంగాలలో వినడానికి కూడా ఇబ్బంది పడే విధంగా మాట్లాడుతున్నారు.. సమావేశాలలో మహిళలు కూడా ఉంటారన్న సంగతి మాజీ మంత్రివర్యులు గుర్తుపెట్టుకుని మాట్లాడితే బాగుంటుంది.. భాష అనేది హుందాగా ఉండాలి..

**ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం...**

రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల కాలం గడిచింది.. పదవుల పంపకం విషయంలో పాతవారితో పాటు అర్హులైన కొత్తవారికి కూడా పదవులు ఇవ్వడం జరుగుతుంది.. మొదటి నుండి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం చేస్తాం.. అందరికీ పార్టీ పదవులు ఇవ్వలేము.. అలాంటి వారిని గుర్తించి వారికి సముచితమైన గౌరవం ఇస్తాం...

**పార్టీ లైన్ దాటితే ఉపేక్షించేది లేదు...**

పార్టీలో ప్రజాస్వామ్యం ఉంది కదా అని పార్టీ యొక్క అంతర్గత సమావేశాలలో మాత్రమే మాట్లాడాలి అంతేకానీ ఎవరైనా పార్టీ లైన్ దాటి మాట్లాడినట్లయితే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.. అని ఆయన అన్నారు.

# పాలెం మాజీ సర్పంచ్ ఎల్ రాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రావుల

వనపర్తి అక్షిత ప్రతినిధి :

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామ మాజీ సర్పంచ్ ఎల్ రాంరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు, బిఆరెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్ రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు అర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరితో పాటు మురళీదర్ రెడ్డి, అశోక్, నాగిరెడ్డిలు ఉన్నారు.



www.aakshitha.com People's voice అక్షిత జాతీయ దినపత్రిక AKSHITHA NATIONAL DAILY



# చదువుతోనే ఉజ్వల భవిత

(మొదటిపేజీ తరువాయి)

మహిళలు ఏ కారణంతోనైనా తమ చదువును మధ్యలో ఆపేసి ఉంటే, మళ్లీ చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలను కేవలం ఆర్థికంగా మాత్రమే కాకుండా విద్య, నైపుణ్య రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. తన జీవితమే ఇందుకు ఉదాహరణ అని, వివిధ కారణాలతో నిలిచిపోయిన తన చదువును తిరిగి కొనసాగించకపోయి ఉంటే నేడు ఈ స్థాయిలో ఉండే అవకాశం ఉండేది కాదని ఆమె అన్నారు.తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటి దగ్గర నుంచే 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. కుటుంబ బాధ్యతలు, పనులు చూసుకుంటూనే మహిళలు చదువును కొనసాగించవచ్చని చెప్పారు.ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలు చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్చుకున్నారని, వారిలో అనేక మంది ఉల్లాస్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అక్షరాస్యత సాధించిన మహిళలకు ఇకపై 10వ తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.“మహిళలు చదువుకుంటే వారికి మరిన్ని ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. విద్య మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అందుకే అక్కచెల్లెమ్మలంతా 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ముందుకు రావాలి” అని మంత్రి పిలుపునిచ్చారు. దగ్గరలోని మీ సేవా కేంద్రాలు, టాస్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ప్రతి మండలం నుంచి కనీసం 100 మంది మహిళలు 10వ తరగతి పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను మంత్రి కోరారు. “చదువుకు వయసుతో సంబంధం లేదు. 14 ఏళ్లైనా, 40 ఏళ్లైనా చదువును కొనసాగించవచ్చు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి మహిళకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఒక్క అడుగు ముందుకు వేస్తే చాలు.. ఆగిపోయిన చదువును మళ్లీ కొనసాగించవచ్చు. మీ కోసం వచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని చదువును పూర్తి చేసుకోండి. మీ చదువు మీకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది” అని మంత్రి సీతక్క అన్నారు. ఆగిపోయిన చదువును మళ్లీ ప్రారంభించి, విద్యతో కొత్త అవకాశాలకు బాటలు వేసుకోవాలని మహిళలకు మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)



రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

# కేటీఆర్‌కు సిరిసిల్లలో సినిమా చూపిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

# ప్రభుత్వ పథకాలను అధికారులు సమర్ధవంతంగా అమలు చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షిత బ్యూరో, మంచిర్యాల :

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పథకాలను అధికారులు సమన్వయంతో పనిచేసి సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రీ-సర్వే, సాదాబైనామా, 22-ఎ, భూభారతి, రెవెన్యూ సదస్సులు, ప్రజావాణి, కళ్యాణలక్ష్మి - షాదిముబారక్, కోర్టు కేసులు, ఆర్ ఓ ఆర్ చట్టం, ఇసుక, భూసేకరణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియకు సంబంధించిన పనులను సమర్ధవంతంగా పూర్తి చేయడంతో పాటు, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులు, 22-ఎ కు సంబంధించిన భూ సమస్యలు, భూభారతి ద్వారా అందుతున్న దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులు, ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిశీలించి, అర్హత కలిగిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కోర్టు కేసులు, ప్రభుత్వానికి సంబంధించిన భూ వివాదాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఆర్ ఓ ఆర్ చట్టం క్రింద పెండింగ్‌లో ఉన్న రికవరీ కేసులను సమీక్షించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇసుక నిర్వహణ, రవాణా సంబంధిత అంశాలపై నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, అక్రమ రవాణాకు తావు లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించిన కేసులలో రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు, పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ అంశాలను నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ రావు దేశ్‌పాండే, అన్ని విభాగాల పర్యవేక్షకులు, మండలాల తహసిల్దార్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డల ఆరోగ్యం

వేములపల్లిలో జాతీయ 9వ పోషణ మాసోత్సవాలు

అక్షిత న్యూస్, వేములపల్లి :



ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోగల వేములపల్లి మండలం వేములపల్లి ఎన్ఎస్పి క్యాంప్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం 9 వ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పుట్టల సందీప్ హాజరయ్యారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పరిమి రజిని హాజరై గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నపిల్లల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు ప్రతిరోజు తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, ప పాలు,గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యం గా ఉంటుందని ముఖ్యంగా మొదటి 1000 రోజుల్లో పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు రక్తహీనత నివారించడానికి ఐరన్ విటమిన్లు ఉన్న ఆహారం తీసుకోవాలని అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న బలవర్ధకహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం దత్తత ఇవ్వడం తీసుకోవడం చట్టరీత్య నేరమని అలాంటివి గ్రామంలో జరగకుండ ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని సూపర్వైజర్ రజిని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల సందీప్, మాజీ వైస్ ఎంపీపీ రావు ఎల్లారెడ్డి పి ఆర్ ఏఈ బిందు, పోషణ అభియాన్ బిసి రమణి, అంగన్వా టీచర్స్ శోభారాణి జయమ్మ, రజిత శశికళ ఆశా వర్కర్ కౌసల్య,ఆయాలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు విశిష్ట పురస్కారం

-అవార్డు గ్రహీతకు అభినందనలు

-ఇంపాక్ట్ ఔట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న మాశెట్టి శ్రీనివాస్

మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :




విజయవాడలో ప్రెసిడెన్షియల్ అకాడమీ ప్రోగ్రాంలో జాతీయ స్థాయిలో ప్రముఖులు సమక్షంలో నల్గొండ రీజన్-2 నుండి ఐసీఐ మిర్యాలగూడ డైమండ్ క్లబ్ ప్రెసిడెంట్ మాశెట్టి శ్రీనివాస్, ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ గా, ఐసిఐ డైమండ్ క్లబ్ ప్రెసిడెంట్ గా, అనతి కాలంలో క్యాలెండర్ ఈవెంట్స్ తో పాటు నార్కోటెక్ సోల్జర్ గా, ఐ డొనేషన్, బాడీ డొనేషన్, ఆర్గాన్ డొనేషన్ పై ఎక్కువ ప్రోగ్రామ్స్ చేసినందుకుగాను ఐసీఐ మిర్యాలగూడ డైమండ్ క్లబ్ ప్రెసిడెంట్ మాశెట్టి శ్రీనివాస్ డైమండ్ కు ఔట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ అవార్డు దక్కింది. అలాగే ఆయన కుమార్తె బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు దక్కించుకోవడం రీజియన్ 2 నల్గొండకు ఎంతో గర్వకారణమని రీజియన్ టు ప్రెసిడెంట్ కోట సరితకోట, నేషనల్ ప్రెసిడెంట్ ఆర్వీఆర్, నేషనల్ సెక్రెటరీ మారోజు రమేష్, నేషనల్ ట్రెజరర్ నూనె సుదర్శన్, ఎన్వీపి.మమత మారేపల్లి, అభినందించారు. కార్యక్రమంలో నక్క మంగ తాయి పాల్గొన్నారు.

# ధర్మోరా లో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...

-అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

-ఎంపీఓ సల్మాన్ రాజ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్...

లోకేశ్వరం, సెప్టెంబర్ 29 అక్షిత న్యూస్ :

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల పరిధిలోని ధర్మోరా గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ పేదవాడికి పారదర్శకంగా చేరాలనే ఉద్దేశంతోనే ఈ నూతన కార్డులను అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీవో సోలామాన్ రాజ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్,ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్క పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు సజావుగా వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి సంజీవ్ రెడ్డి,ఉప సర్పంచ్ మంద గణేష్,పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, జీపీఓ సులోచన,స్థానిక



రేషన్ డీలర్,గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు...


# సర్టిఫికెట్ పోయినది

నా పేరు లోడి జ్యోతి తండ్రి మత్యగిరి ఊరు నిదానపల్లి, మండలం రామన్నపేట జిల్లా యాదాద్రి భువనగిరి 20.09.2026 రోజున నిదానపల్లి నుంచి రామన్నపేటకు బైక్ పై వెళ్తుంటే మార్గమధ్యలో నా సర్టిఫికెట్ (డిగ్రీ ప్రొవిజనల్ ) ఎక్కడో పడిపోయాయి. మేము రామన్నపేటకు వచ్చిన తర్వాత చూసుకోగా సర్టిఫికెట్ మిస్ అయింది. మళ్ళీ రోడ్డుపై వెతకగా కనపడలేదు. కావున నా సర్టిఫికెట్ ఎవరికైనా దొరికితే ఇవ్వగలరు.

సంప్రదించండి :
లోడి జ్యోతి
తండ్రి మత్యగిరి
7569127041


Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published